ప్రజాశక్తి
ఆదివారం 5 మే 2024
I
అల్లూరి సీతారామరాజు

8న బృందా కరత్ పర్యటన

ప్రజాశక్తి-చింతపల్లి:పాడేరు, చింతపల్లిలో ఈనెల 8న సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యురాలు బందా కారత్ పర్యటించనున్నారని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. శనివారం చింతపల్లిలో బృందాకరత్ సభా స్థలాన్ని సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనంజయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో నరేంద్ర మోడీకి ఓటమి తప్పదన్నారు. ఇండియా వేదికను గెలిపించడంతోనే ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకిక తత్వం కాపాడబడతాయన్నారు. ఈనెల 8న ఉదయం 11 గంటలకు పాడేరులోనూ, 3గంటలకు చింతపల్లిలో నిర్వహించే రోడ్ షోను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు సిపిఎం మండల కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

రోడ్‌షో స్థలాన్ని పరిశీలిస్తున్న పడాల్

9న కూనవరానికి సీతారాం ఏచూరి

◆ సిపిఎం అభ్యర్థుల గెలుపునకు బహిరంగ సభ

◆ హాజరుకానున్న ఇండియా బ్లాక్ జాతీయ నాయకులు

ప్రజాశక్తి - ఎటపాక



సిపిఎం అభ్యర్థుల గెలుపు కోసం ఈ నెల 9న కూనవరంలో జరిగే బహిరంగ సభకు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరుకానున్నారు. ఆయనతో పాటు ఇండియా బ్లాక్‌లోని కొత్తగూడెం సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తెలంగాణ రాష్ట్ర మంత్రి, కాంగ్రెస్ నాయకులు తుమ్మల నాగేశ్వరరావు, సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, ఎపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ పాల్గొననున్నారు. ఈ బహిరంగ సభ జయప్రదానికి సిపిఎం శ్రేణులు ఇప్పటికే సమాయత్తమయ్యాయి. సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావులను గెలిపించాలని సిపిఎం అల్లూరి జిల్లా ఏజెన్సీలో చేపట్టిన ప్రచారానికి ప్రజల నుండి సంపూర్ణ మద్దతు లభిస్తోంది. టిడిపి, జనసేన, బిజెపి కూటమిపైనా, నిరంకుశ వైసిపిపైనా ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఏజెన్సీలో సిపిఎంకు ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, నిరుద్యోగ యువత నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది. ప్రధాన పోటీదారుగా సిపిఎం బలపడిందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మతోన్మాద బిజెపి తమను అడవి నుంచి తరిమేసే కుట్రలను పసిగట్టిన ఆదివాసీలు ఆ పార్టీకి వ్యతిరేకంగా నేడు సంఘటితమయ్యారు. ఈ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే రాజ్యాంగం రద్దుతో పాటు ఆదివాసీల చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని వారంతా భావిస్తున్నారు. ఏజెన్సీలో వైసిపి, టిడిపి గెలుపు బిజెపి గెలిపేనని ప్రజలు ఇప్పటికే గ్రహించారు. పోలవరం నిర్వాసితులకూ ఇక్కడ ప్రధాన పార్టీలు ఏవి గెలిచినా మరణ శాసనమే కానుందన్న అభిప్రాయం ఇక్కడ వ్యక్తమవుతోంది. అందుకే అల్లూరి జిల్లాలో బిజెపి, టిడిపి, వైసిపిలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2022 జులైలో గోదావరి వరదలు ముంపు మండలాలను అతలాకుతలం చేశాయి. అయిప్పటికీ వైసిపి, టిడిపి, బిజెపిలు నిర్వాసితుల పక్షాన నిలవలేదు. సిపిఎం మాత్రమే ప్రజల పక్షాన నిలబడింది. వరదల సమయంలో నాలుగు మండలాల్లో సిపిఎం గ్రామ గ్రామానా భోజనాల ఏర్పాటు చేసింది. విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. అనంతరం నెల్లిపాక నుండి ముంపు మండలాల మీదుగా విజయవాడ వరకు నిర్వాసితుల పక్షాన పోలవరం పోరుకేక పోరుతో పాదయాత్ర చేపట్టారు. దీంతో ఆ సమస్య జాతీయస్థాయికి వెళ్లింది. అంతేగాకుండా సిపిఎం జిఒ నెంబర్ త్రీ రద్దుపైనా, బోయ / వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపైనా ఏజెన్సీలో ప్రజా పోరాటాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఆదివాసీలు, పోలవరం నిర్వాసితులు సిపిఎంకు మద్దతు తెలుపుతున్నారు. పదేళ్ల కాలంలో ఈ ప్రాంత సమస్యలను పట్టించుకోని టిడిపి, వైసిపి ఎమ్మెల్యేలపై ప్రజల్లో ఉన్న తీవ్రమైన వ్యతిరేకత సిపిఎంకు సానుకూలంగా మారనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 9న ఇండియా బ్లాక్ తరఫున కూనవరం పోలీస్ స్టేషన్ సమీపాన భారీ బహిరంగ సభను సిపిఎం ఏర్పాటు చేసింది.

మోడీ ప్రభుత్వాన్ని ఓడిస్తేనే రాజ్యాంగ పరిరక్షణ

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వెంకట్

ప్రజాశక్తి-కూనవరం, చింతూరు

కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వాన్ని ఓడిస్తేనే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించుకోగలమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. చింతూరు మండల కేంద్రం, కూనవరం మండలం పల్లూరులో శనివారం జరిగిన సిపిఎం సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని చెబుతున్న బిజెపితో టిడిపి జనసేన జతకట్టాయని, వైపిపి మద్దతు ఇస్తుందని, ఆ పార్టీలను ఓడించటమే నేడు ప్రధాన కర్తవ్యమని పేర్కొనారు. పోలవరంలో మునిగిపోతూ నేటికీ పునరావాసం దొరకని రైతులు, ప్రజానీకం, అడవి నుండి గెంటివేయబడుతున్న ఆదివాసీలు, రక్షణ కోల్పోతున్న మైనారిటీలు తీవ్ర అభద్రత భావంతో ఉన్నారని పేర్కొన్నారు. వారి కోసం నిరంతరం నిబద్ధతతో పనిచేస్తూ, పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు న్యాయం జరగాలంటే సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని, అందుకోసం ప్రతి కార్యకర్తా ఒక సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం మాజీ ఎమ్మెల్యేలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కూనవరం పోలీసుస్టేషన్ గ్రౌండ్‌లో ఈ నెల 9న జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య, కూనవరం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, ఆవుల ఉపేంద్ర, చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్, జిల్లా నాయకులు పల్లపు వెంకట్, మండల నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, మడకం చిన్నయ్య, మొట్టుమ్ రాజయ్య, కలుముల మల్లేష్, పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, సిహెచ్ సుబ్బారావు, బి దిలీప్, రామారావు పాల్గొన్నారు.

చింతూరు సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

పాడేరులో పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి భావన వశిస్ట్

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

- వినియోగించుకున్న 173 మంది ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరు : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొదటి రోజు 48 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకున్నారని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, సంయుక్త కలెక్టర్ భావన వశిస్ట్ తెలిపారు. శనివారం స్థానిక తలారిసింగి ప్రభుత్వ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఫారం 12లో దరఖాస్తు చేసుకుని పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. పాడేరు నియోజక వర్గంలో 2050 మంది పోస్టల్ బ్యాలెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఎనిమిదవ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభించి సాయంత్రం 5 గంటల వరకు

అరకు లోయ :సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ లో భాగంగా మొదటి రోజు 125 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ను సద్వినియో గించుకున్నారని అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ తెలియజేశారు. శనివారం స్థానిక కంఠభౌంసుగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఫారం 12లో దరఖాస్తు చేసుకుని పోస్టల్ బ్యాలెట్ ను సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు.పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఎనిమిదవ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. రంపచోడవరం, పాడేరు, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, ఐటీడీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో పరిశీలిస్తున్న పిఒ

మండల కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కూనవరం

మే 13వ తేదిన జరిగే సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌ను గతంలో మాదిరిగానే మండల కేంద్రాల్లో వినియోగించే విధంగా ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని యుటిఎఫ్ కూనవరం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తహశీల్దారు అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో సంప్రదించగా ఫెసిలిటీస్ సెంటర్లు ఏర్పాటు చేసే అధికారం తనకు లేదని తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల చరిత్రలో నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే విధానం గతంలో ఎన్నడూ లేదన్నారు. తక్షణమే మండలం కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ర్యాలీలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, రిటర్నింగ్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అన్నారు. శనివారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం నుండి వివిధ కార్యాలయాలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో ఓటర్ల ఓటు హక్కు వినియోగంపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలలో నిర్భయంగా నచ్చిన అభ్యర్థులకు ఓటు వేయడానికి ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రంపచోడవరం డిఎఫ్ఓ జిజి. నరేంద్రన్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకునే బాధ్యత పౌరులపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు ఎ.కృష్ణ జ్యోతి, ఏవి రమణ, డిప్యూటీ తాసిల్దార్‌లు బి.రాజు. సత్యనారాయణ, ఎడియంహెచ్‌ఓ జి.ప్రకాశం, సిడిపిఓ సంధ్యారాణి, ఎంపిహెచ్‌ఓ పీటర్, సిఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహనరావు, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- వై.రామవరం : మండలంలోని పులుసుమామిడి గ్రామాన్ని మారేడుమిల్లి సిఐ రుద్రరాజు భీమరాజు, గుర్తేడు ఎస్ఐ సాయి కుమార్ ఆధ్వర్యాన వై.రామవరం మండలం గుర్తేడు వద్దగల హెలిప్యాడ్ పరిసర ప్రాంతాలలో, పాతకోట పరిసర ప్రాంతాలలో శనివారం డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో విస్తృతమైన తనిఖీలు నిర్వహించారు. అన్ని ముఖ్యమైన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు పోలింగ్ సామాగ్రి తరలించేందుకు ఈ హెలీప్యాడ్‌ను ఉపయోగించనున్నట్లు చెప్పారు సంఘ విద్రోహ శక్తులు గ్రామాల్లో ప్రవేశించకుండా ప్రత్యేక పోలీసు బలగాలతో ఈ ప్రాంతమంతా పహారా కాస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కార్డు ద్వారా పింఛను సొమ్ము చెల్లింపు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : గ్రామీణ తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టాఫీసులో ఐపిపిబి అకౌంట్ లేని వారికి కూడా ఆధార్ పేమెంట్స్ ద్వారా పింఛన్ డబ్బులు ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం డివిజన్ పోస్టల్ అధికారి తాతు నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ దారులు మండుటెండలో మండల కేంద్రానికి, బ్యాంక్‌లకు రావాల్సిన అవసరం లేదని, పంచాయతీ పరిధిలోని బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా పోస్ట్ ఆఫీస్‌ల సమయంలో పింఛన్ డబ్బులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

-జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు:సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత స్పష్టం చేసారు. స్థానిక గురుకుల కళాశాలలో రంపచోడవరం, అరకు వ్యాలీ, పాడేరు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని 489 మంది ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇవిఎంల వినియోగంపై నిర్వహించిన రెండవ విడత శిక్షణా కార్యక్రమంలో శనివారం మధ్యాహ్నం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు నిరంతరం సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని చెప్పారు. మాక్ పోలింగ్ ప్రక్రియ నుండి పోలింగ్ రోజు నిర్వహించాల్సిన అంశాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా విధులు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

జిల్లా ఎన్నికల పరిశీలకులు కె.వివేకానందన్ మాట్లాడుతూ, ఎన్నికల సిబ్బందికి వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియపై రూపొందించిన వీడియోను పదే పదే పరిశీలించి అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించడానికి ఏర్పాటు చేసిన చిత్రాలను కవర్ చేయాలని చెప్పారు.అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడి ఏ పిఓ వి.అభిషేక్, పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ, పోలింగ్ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి వివరించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకుని పోలింగ్‌ను విజయవంతం చేయాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేసారు. ఫారం 17సి, మాక్ పోల్ సర్టిఫికేట్, బ్లాక్ కవర్ సర్టిఫికేట్లను సక్రమంగా స్ట్రాంగ్ రూంకి తిరిగి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, రంపచోడవరం, పాడేరు, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ప్రిసైడింగ్ అధికారులు, ఎపిఓలు తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎంలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజన మహిళాలు, నాయకులు కోరారు. మండలంలోని పాతకొట పంచాయతీలోని పి.చింతలవిధీ, పాతకొటలో తాగునీటి కొరతతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాన్ని సందర్శించిన ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, టి.కృష్ణారావు, సోమన్న మాట్లాడుతూ, ఓట్లు అడిగే నాయకులు గ్రామంలో నెలకొన్న తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.తాగునీటి సౌకర్యం కల్పించని నాయకులకు ఓటును అడిగే హక్కు లేదన్నారు.5సంవత్సరం పరిపాలన చేసినా తాగునీటి సౌకర్యం కూడా ఇవ్వలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు దేవుడు నాయుడు, నాయకులు శివ, చిట్టిబాబు, రామారావు, గ్రామ ప్రజలు బాకురు శ్రీనివాసరాజు, చిన్నలమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

సమస్యను తెలుసుకుంటున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

పింఛన్ కోసం అవస్థలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని వృద్ధులు వితంతువులు, వికలాంగుల పింఛన్ల కోసం ఇబ్బంది పడ్డారు. మొదటి రోజు నుంచి పింఛనుదారులు అవస్థలు పడుతూనే ఉన్నారు. మూడు రోజుల పాటు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ పలు ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ తీసుకోవడానికి లబ్ధిదారులు మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రంలో ఉన్న యూనియన్ బ్యాంక్‌కు శనివారం తెల్లవారు జామున వచ్చి పడిగాపులు కాశారు. పింఛన్ తీసుకోవడానికి వచ్చి రోడ్డుపైన ఓ వయోవృద్ధురాలు కూర్చుని తీవ్ర ఇబ్బంది పడింది.

బ్యాంకు వద్ద రోడ్డుపై కూర్చున్న వృద్ధురాలు

వైసిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అరకు పార్లమెంట్, అసెంబ్లీకి పోటీ చేస్తున్న వైసిపి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని పోతంగి పంచాయతీ బోడిగుడ, బయలు వలస, పోతంగి, తోటవలస, చెలిమర వలస గ్రామాల్లో శనివారం ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపగడపకు తిరుగుతూ బ్యాలెట్ నమూనా పత్రాలను ఇచ్చి వైసిపికు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎం శ్రీరాములు, పంచాయతీ సర్పంచ్ వి.వెంకట్రావు, ఉప సర్పంచ్ ఎస్.జగ్గు నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు ఎస్.గోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐలు

హత్య కేసులో నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:- ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే వ్యక్తి హత్య కేసులో నిందితుడు రుక్ధాధర్ సబార్ను పోలీసులు శనివారం కోర్టులో హాజరు పరిచగా రిమాండ్‌కు తరలించారు. అరకు సీఐ రుద్రశేఖర్, ఎస్సై సంతోష్ కుమార్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 1న మండల కేంద్రం డుంబ్రిగుడలో తహసీల్దార్ కార్యాలయ అసంపూర్తి భవనంలో శృంగవరపుకోట మండలం రాజీపేట గ్రామానికి చెందిన బత్తిన శివ శ్రీనివాస్‌ను కర్రతో నిందితుడు బలంగా కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడని చెప్పారు. వీరిద్దరూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి జీవనోపాధి పొందుతుండేవారని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలలను సేకరించిన వీరు అరుకు సంతబయలులోని ప్లాస్టిక్ వ్యర్థాల కేంద్రంలో విక్రయించారన్నారు. వచ్చిన నగదుతో వీరు పంచుకోవాల్సి ఉండగా, శివ శ్రీనివాస్ ఇవ్వకుండా గొడవకు దిగడంతో కోపోద్రేకుడైన నిందితుడు సబార్ను బాధితుడిని కర్రతో తలపై బలంగా కొట్టి పారిపోయడని చెప్పారు. మృతి చెందిన శ్రీనివాస్‌ను ఆసుపత్రికి తరలించి పోస్టుమార్థం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించడం జరిగిందని చెప్పారు. నిందితుడి కోసం గాలించగా అరుకు సంతబయలులోని ప్లాస్టిక్ వ్యర్థాల కేంద్రంలో ఉండగా అదుపులో తీసుకుని ఆరెస్టు చేయడం జరిగిందన్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి సెంట్రల్ జైలుకు తరలించామని వారు తెలిపారు.

తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-పెదబయలు:సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పెదబయలులో ఎస్ఐ పి.మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. బంబ్‌స్క్వాడ్‌తో పెదబయలు, అరడకోట, చుట్టమేట్ట, మంగబంద, శిరీషపల్లి, గంపరాయిలో తనిఖీలు చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని లెవెన్ కె.వి విద్యుత్తు లైన్లో మరమ్మతుల నిమిత్తం ఈనెల 5న ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవిఎన్ ఎం అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల జరుగుతుందని ఆయన తెలిపారు.

సిపిఎం గెలుపుతోనే ఏజెన్సీ సమగ్రాభివృద్ధి

ప్రచార ర్యాలీలో మాట్లాడుతున్న రంపచోడవరం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు

ప్రజాశక్తి-యంత్రాంగం

మారేడుమిల్లి : ఏజెన్సీ సమగ్రాభివృద్ధి జరగాలంటే సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపించాలని ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు విజ్ఞప్తి చేశారు. మారేడుమిల్లి మండలంలో శనివారం లోతా రామారావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సున్నంపాడు గ్రామంలో గిరిజన మహిళలు రామారావుకి హారతిచ్చి పూలమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆ గ్రామం నుండి పెద్ద ఎత్తున ఆదివాసీ యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. సంతల్లో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా నేటికీ మారుమూల గ్రామాల్లో అభివృద్ధి కానరావడం లేదని, రోడ్లు, మంచినీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే అసెంబ్లీలో ఏజెన్సీలో మౌలిక వసతులపైనా, ఆదివాసీ చట్టాలు, హక్కులు అమలు కోసం పోరాడుతానని చెప్పారు. సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఏలూరు జిల్లా నాయకులు రామకృష్ణ, నాగమణి, నాగేశ్వరరావు, రమేష్, వేటుకూరు సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి, పార్టీ నాయకులు ఈతపల్లి సత్యనారాయణ, సిరిమల్లి రెడ్డి, ఆదిరెడ్డి, వీకా రాజన్న దొర, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అడ్డతీగల : ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోత రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి వేయించి గెలిపించాలని కోరుతూ మండలంలోని డి.భీమవరం పంచాయతీ మామిడిపాలెం, తుంగమడుగుల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కెఎస్ శ్రీనివాస్, టి.ఈశ్వరరావు, కె.సింహాచలం, లావణ్య, దొర, ఎం.మురళి పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేకపల్లి పంచాయతీ పరిధి ఉమ్మిడివరం, రేఖపల్లి, రామవరం, ములకనపల్లి పంచాయితీల పరిధిలోని జల్లివారిగూడెం వీరపాపనకుంట, రామవరం, తెల్లంగుంపు, కొప్పల్లి తదితర గ్రామాలలో సిపిఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజానాట్య మండలి కళాకారుల చేసిన నృత్య ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. కార్యక్రమాల్లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, శ్రీరాంగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, హాజరత్, జి లక్ష్మణరావు, సోడి మల్లయ్య, నల్లారపు ప్రకాష్, వీర్ల వెంకటేశ్వర్లు, తాతబాబు, నాగిరెడ్డి, వడ్లాది రమేష్, కమ్మ చిచ్చు సత్యనారాయణ పాల్గొన్నారు.

వై.రామవరం : మండలంలోని దేవరమడుగు, పెద్దవులంపాడు, జంగాలతోట గ్రామాల్లో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామకృష్ణ, శాంతి రాజు, ఆంజనేయులు, మల్లికార్జున దుర్గ, ప్రజా నాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం చదలవాడ పంచాయతీ మిట్టవాడ గ్రామంలో సిపిఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుల వెంకట్, మండల నాయకులు చిన్నయ్య, మల్లేష్, వీరయ్య, సుబ్బారావు, రామారావు, బొజ్జి, రవి, గణేష్, కిట్టమ్మ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలి...

సీలేరు : కాంగ్రెస్, సిపిఐ బలపర్చిన అరకు పార్లమెంటు సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ జీకే వీధి మండలం సంకాడ పంచాయతీ డింగిరాయి. సత్యమామిడి, దారకొండ, గుమ్మరేవులు, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలోని మారుమూల గ్రామాల్లో శనివారం సిపిఎం నాయకులు విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అంపరంగి బుజ్జిబాబు నాయకులు జి.సత్యనారాయణ, కుర్ర బాలయ్య, పాంగి బాబురావు, గెమ్మెల్ పరమేశ్వరరావు, సత్తిబాబు, కోటేశ్వరరావు, కాంగ్రెస్, సిపిఐ నాయకులు మల్లు దొర సొన్ను, రాంబాబు, మాజీ సర్పంచ్‌లు అల్లంకి రాజు, బాబురావు సంకర విష్ణుమూర్తి పాల్గొన్నారు.

దుంబ్రిగుడ:- ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పల నర్సకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని రంగిలిసింగి పంచాయతీ ఆంధ్ర ఒడిశా సరిహద్దు మారుమూల గ్రామమైన కుట్టిలో సిపిఎం నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆ గ్రామంలోని గిరిజనులకు బ్యాలెట్ నమూనా పత్రాలతో పాటు కరపత్రాలను పంచిపెట్టి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఆర్ రాము మాట్లాడుతూ, జీవో 3 పునరుద్ధరణకు సిపిఎం నిరంతరం పోరాడుతుందని చెప్పారు. కితలంగి పంచాయితీ పింపల్‌గుడ గ్రామంలో సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డుంబు, మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని వారపు సంతలో సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రచారం చేపట్టారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడారు. సీపీఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స ఉద్యోమకారుడుగా ప్రజా సమస్యలపై దీర్ఘకాలం పోరాటాలు చేస్తున్న నాయకుడుని, లోక్ సభకు పంపిచాలన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట వైఎస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సీపీఎం జిల్లా నాయకులు ఎస్ హైమావతి, దేముడు నాయుడు, నాయకులు కృష్ణారావు, లక్ష్మరావు, కృష్ణ మూర్తి, చిట్టిబాబు, సోమన్న, రామారావు, మూర్తి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని వారపు సంతలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, మండల వైస్ ఎంపీపీ 1 పాటుబోయి సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డంగి తుమ్మాళ్ల ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. అప్పలనర్స, అరకు అసెంబ్లీ అభ్యర్థి శెట్టి గంగాధరస్వామిలను గెలిపించలని కోరారు. సిపిఎం పార్టీ కార్యాలయం నుండి జడ్పీ గెస్ట్ హౌస్, జిసిసి గోడౌన్ సమీపం నుండి దుర్గ గుడి వద్ద భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు, మండల కమిటీ సభ్యులు, గాసిరం దొర, ఎంఎం శ్రీను, వంతల లైకోన్, కొర్ర శంకర్రావు పాల్గొన్నారు.

పెదబయలు : మండలంలోని గోమంగి పంచాయతీ నేరేడు పుట్టు, కుమ్మరి వీధి, గోమంగి, రాయిమామిడి, బోయ రాజులు గ్రామాల్లో సిపిఎం మండల నాయకులు సబన్న సునీల్ కుమార్, నరేష్ ప్రచారం నిర్వహించారు. సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: లోతేరు వారపు సంతలో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. సిపిఎం నాయకులు పొద్దు బాలదేవ్, వివి జయ మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాలు కాపాడాలంటే సిపిఎం అభ్యర్థి అప్పలనర్సను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లైకోన్, పి.రామన్న, కె.మగ్గన్న, రాము, గాసి, దొబులు, అప్పన్న, సన్యసమ్మ, రాము, కె.బుజ్జిబాబు పాల్గొన్నారు.

అనంతగిరి: ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పాసిపెంటర్ అప్పలనర్సను గెలిపించాలని సిపిఎం జెడ్పీటీసీ దీసరి గంగరాజు, కాంగ్రెస్ మహిళ జిల్లా నాయకురాలు శాంతకుమారి కోరారు. మండలంలోని ఎగువశోభ పంచాయతీ బీసుపురం, హెక్టగుడ, మర్దగుడ, కొత్తవలస, అనంతగిరి, లక్ష్మీపురం, టోకురులో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యధర్శి ఎస్ నాగులు. కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

హుకుంపేట మండలంలో ప్రచారం చేస్తున్న ఇండియా ఫోరం నాయకులు సురేంద్ర తదితరులు

ముంచంగిపుట్టు మండలంలో ప్రచారం చేస్తున్న ఇండియా ఫోరం నాయకులు

కేడీ పేటలో భారీ వర్షం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట, ఏఎల్ పురం, కొంకసింగి, సీహెచ్.నాగాపురం, లింగంపేట తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ప్రజలంతా ఆపసోపాలు పడ్డారు. ఈ వర్షంతో ఒక్కసారిగా వాతావరణం అంతా చల్లబడింది. ఈ గాలులకు ఏఎల్ పురం సమీపంలో నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడటంతో ట్రాఫిక్ కు కొంత సేపు అంతరాయం కలిగింది.

కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ ప్రచారం

ప్రజాశక్తి -కొత్తకోట: ఇండియా కూటమి బలపరచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థిలను గెలిపించాలని కోరుతూ సిపిఎం, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో శనివారం రావికమతం మండలం కొత్తకోటలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి జగత శ్రీనివాస్, సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఎస్‌వీ నాయుడు తదితరులు మాట్లాడుతూ, ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకం కింద ప్రతి జాబు కార్డుదారునికి 200 రోజులు పని దినాలు, రోజు కూలి రూ 400 వేతనం కల్పిస్తామన్నారు. షుగర్ ఫ్యాక్టరీలు ప్రైవేట్ పరం కాకుండా కాపాడతామని, ఇల్లు నిర్మాణానికి రూ 5 లక్షలు, ఉచిత గ్యాస్ సరఫరా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సాంబశివరావు, యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరావు, రమణాజీ పాల్గొన్నారు...

ఎబిఎం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: స్థానిక ఏబీఎం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, నక్కపల్లి యూనిట్ నిర్వహణలో హెచ్‌ఆర్ ఐ.నరేష్, వి.నరేంద్రల ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఇందులో బీఎస్సీలో కెమిస్ట్రీ అభ్యర్థులు 60 మంది హాజరవ్వగా 26 మంది ఎంపికయ్యారు. కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు సహకారంతో పీ.సత్యనారాయణ, ఎన్.రామకృష్ణ, ఎ.శ్రీనివాస్, ఆర్.నానాజీ, ఎ.కుమార్ అధ్యాపకుల పర్యవేక్షణలో ఈ మేళాను నిర్వహించారు.

కంచాల ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలోని చౌడువాడ, గొట్టువాడ, జగ్గంపేట, రామచంద్రపురం, పందూరు గ్రామాలలో పాయకరావుపేట వైసిపి అభ్యర్థి కంబాల జోగులు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ, మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి బాటలో నిలుపుతానని, పెండింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు కిల్లాడి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, పైల రమేష్, మాజీ జడ్పిటిసి సభ్యురాలు వెంకటలక్ష్మి, సిద్ధబత్తుల సత్తిబాబు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి నేతల ప్రచారం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని దొండవాక గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ఉపాధి కూలీలకు, సముద్ర తీరంలో మత్స్యకారులకు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. దొండవాక సముద్ర తీరంలో బోటు ఎక్కి వినూత్న రీతిలో నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురుందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, మెరుగు నాగేశ్వరరావు, తాతారావు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగంపేట పంచాయతీలో వైసిపి చెందిన లాలం చినబాబులు నాయకత్వంలో మాజీ సర్పంచ్ సుర్ల సీతరామమూర్తి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి పలు కుటుంబాలు చేరారు.. ఈ సందర్భంగా టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గ్రామ పార్టీ నాయకులు తీరు వల్లే పార్టీని వీడి తెలుగుదేశంలో చేశామని లాలం చినబాబులు తెలిపారు.

ఫారెస్టు బీట్ సిబ్బందికి స్టడీ టూర్

నూతనంగా ఎంపికైన ఫారెస్ట్ బీట్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న సబ్ డిఎఫ్ఓ

ప్రజాశక్తి -సీలేరు : నూతనంగా ఎంపికైన పదో బ్యాచ్ ఫారెస్ట్ బీట్ సిబ్బందికి అడవుల సంరక్షణ, పెంపకంపై స్టడీ టూర్‌లో భాగంగా శనివారం సీలేరు అటవీ రేంజి పరిధిలో వలసగెడ్డ టేక్ ప్లాంటేషన్లో విస్తృతంగా పర్యటించారు. టేకు వనాలు పెంపకం వాటి సంరక్షణ చెట్లు ఎదుగుదల తదితర అంశాలపై క్లుప్తంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా చింతపల్లి అటవీ శాఖ సబ్ డిఎఫ్ఓ బెర్నాడ రాజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అటవీశాఖ కోర్స్ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతనంగా ఉద్యోగ నియామకాలకు ఎంపికైన 30 మంది శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. టేక్ ప్లాంటేషన్ నాటినప్పటి నుంచి వాటి రక్షణ చర్యలు వాటి ఎదుగుదలకు ఎటువంటి చర్యలు చేపట్టాలి, చెట్లు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను ఏ విధంగా తొలగించాలి అనే అంశాలపై వివరించినట్లు తెలిపారు. దారకొండ సమీపంలో ఉన్న వర్తండపాడు వద్ద 2014లో ప్లాంటేషన్లో నాటిన చెట్లు ఏఏ జాతులకు చెందినవి ప్లాంటేషన్ ఏ విధంగా చేసామో అవగాహన కల్పించమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రేంజ్ అధికారి కే శ్రీనివాసరావు, డిఆర్ఓ సింహాచలం పడాల్, ఎఫ్‌హెచ్ఓ సతీష్, టెక్నికల్ అసిస్టెంట్ సిహెచ్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారులకు మజ్జిగ పంపిణీ

మజ్జిగ పంపిణీ చేస్తున్న జమాల్‌ఖాన్ ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి-చింతూరు : మండుతున్న ఎండల్లో పింఛన్ కోసం బ్యాంకు వద్ద వృద్ధులు పడిగాపులు కాస్తున్న వేళ ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎస్‌బిఐ బ్యాంకు వద్ద మజ్జిగ కేంద్రాన్ని శనివారం ఏర్పాటు చేశారు. బ్యాంకు మేనేజర్ రబ్బాని ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ రబ్బాని మాట్లాడుతూ పింఛన్ల కొరకు సుదూర ప్రాంతాల నుండి వృద్ధులు ఎండలో ప్రయాణించి బ్యాంకుకు వస్తున్నారని, వేసవి తాపంతో వడదెబ్బలకు గురవుతారని గ్రహించి జమాల్ ఖాన్ తన జెకెసిటి ద్వారా మజ్జిగ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అజీజ్, రమణయ్య, షాజహాన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి- రంపచోడవరం : ఈనెల 13వ తేదీన జరగనున్న సాధారణ ఎన్నికల్లో రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వహించే పిఓలు, ఏపీవోలకు శనివారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఈవీఎంలు, వివి ప్యాడ్లు వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 500 నుండి వెయ్యి మంది ఓటర్లు ఉంటారని తెలిపారు. మీకు నియమించిన అధికారులతో సిబ్బంది ఫోన్లో ఎప్పటికప్పుడు సంప్రదించుకుంటూ ఉండాలన్నారు. ఈనెల 13న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పిడియంయస్ యాప్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఏమైనా సమస్యలు ఉన్నాడేలా ఎప్పటికప్పుడు సెక్టార్ అధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగ్ రోజున సెల్ఫోన్ సిగ్నల్ లేని ప్రాంతాలలో రన్నర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్లు ఏవి రమణ, సత్యనారాయణ, డిప్యూటీ తాసిల్దారులు శివ, బి.రాజు, శ్రీధర్, స్వామి, బాలాజీ, సత్యనారాయణ, చైతన్య, విశ్వనాథ్, సరిత, వీఆర్వోలు, సీనియర్ అసిస్టెంట్లు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల శిక్షణకు వచ్చిన పోలింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న సబ్ కలెక్టర్

గిరిజన యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ

క్రికెట్ కిట్లు అందజేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని పులుసుమామిడి గ్రామాన్ని మారేడుమిల్లి సిఐ రుద్రరాజు భీమరాజు, గుర్తేడు ఎస్ఐ సాయి కుమార్ ఆధ్వర్యాన పోలీసులు సందర్శించి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టోర్నమెంట్ నిర్వహణకు క్రికెట్ కిట్లు, ఇతర సామాగ్రిని అందించారు. క్రీడాకారులకు మంచినీటి సౌకర్యం, ఇతర సదుపాయాలు కల్పించి ప్రత్యక్షంగా ప్రారంభ మ్యాచ్‌లో పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొల్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన యువతను చెడు మార్గాల నుంచి దూరంగా ఉంచుతూ, ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయడం కోసం పోలీసులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పోలీసులు ఎల్లపుడూ అందుబాటులో ఉంటామని, అత్యవసర పరిస్థితుల్లో 9440904865 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చింతూరులో..

చింతూరు : మండలంలోని నిమ్మలగూడెం గ్రామానికి చెందిన నిమ్మలగూడెం క్రికెట్ యూత్ యువకులకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రెండు క్రికెట్ కిట్లును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జమాలఖాన్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలని గతంలో తాను యూత్‌కు మాట ఇచ్చిన ప్రకారం ఈ కిట్లను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్టు సెక్రటరీ ఎండి ఇమ్రాన్ ఖాన్, ట్రస్ట్ ఇంచార్జి సుబహాని, జావేద్, సోడే శ్రీను, క్రికెట్ కెప్టెన్ ఎస్ రమేష్ , నాగేంద్ర, శ్రీరామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న జమాల్‌ఖాన్ ట్రస్ట్ ప్రతినిధులు

పోలీసుల విస్తృత తనిఖీలు

రోడ్లకు ఇరువైపులా తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు : ఎన్నికల దగ్గర పడుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యాన శనివారం జీకే వీధి మండలం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసు బలగాలతో గాలింపు చర్యలు చేపట్టారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో కల్వర్టులు, ప్రధాన కూడళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మావోయిస్టు నుంచి ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

దేవీపట్నంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-దేవీపట్నం : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహణ కొరకు ప్రజలకు తామున్నామనే భరోసా ఇచ్చేందుకు దేవీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫజుల్లాబాద్, ఇందుకూరు, ఇందుకూరుపేట గ్రామాల్లో సివిల్ పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీసు వారు ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటారని, ప్రజలు ఎటువంటి అపోహలకు గురి కావద్దని తెలిపారు.

గుండెపోటుతో ఎఎస్ఐ మృతి

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పీవీ నాగేశ్వరరావు గుండె పోటుతో మృతి చెందారు. ఏడుగుర్రాలపల్లి అవుట్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తుండుగా శుక్రవారం రాత్రి ఆకస్మికంగా అనారోగ్యానికి గురికావడంతో చింతూరు ఎస్సై శ్రీనివాసరావు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

మృతి చెందిన ఎఎస్ఐ నాగేశ్వరరావు

దాతల సాయంతో ఏరియా ఆసుపత్రిలో సౌకర్యాలు

పేషెంట్ల అటెండెంట్ హాల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కోటిరెడ్డి

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పేషెంట్ అటెండర్ హాల్, వంట షెడ్డును శనివారం ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ అండ్ సి, ఈజెడ్ఈ సాఫ్ట్వేర్ గ్రూపు టీం, సీఎస్ఆర్ సపోర్టింగ్ పార్టనర్స్, సామరిటన్ స్వచ్ఛంద సంస్థలు సుమారు రూ.6.90 లక్షలు వెచ్చించి వీటిని నిర్మించినట్లు చెప్పారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు వారి బంధువులకు ఉపయోగపడేలా ఆ సౌకర్యాలు కల్పించిన స్వచ్ఛంద ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు రమణారావు, శశికళ, ఎం.సాయికిశోర్, కౌశిక్, స్పందన, సిబ్బంది రామశేఖర్, నూకరాజు, ముత్తయ్య, బి.శేఖర్, సామరిటన్ స్వచ్ఛంద ప్రతినిధి రామ్ కుమార్, ఎస్ఎస్ అండ్‌సి, ఈజడ్ఈ సాఫ్ట్వేర్ గ్రూపు టీం, సీఎస్ఆర్ సపోర్టింగ్ పార్టనర్స్ ప్రతినిధులు రోగులు, తదితరులు పాల్గొన్నారు.